ప్రేమ కథ

# ముద్దు

- బి.రమణీ ప్రభాకర్



"అప్పుడు హీరో – హీరోయిన్ని గాట్టిగా ముద్దెట్టేసుకున్నాడు" అని ఆపేదు శ్రీను గాడు.

బాబిగాడు నదుస్తూనే, కళ్ళు ఆశ్చర్యంతో పత్తికాయల్లా చేసుకుని వింటున్నాడు.

"తరువాత ఏమైంది" అడిగాడు బాబీ.

"ఇల్లొచ్చేసింది. రేపు చెప్తాలే" స్కూలు బ్యాగు సర్దుకుంటూ లోపలికెళ్ళి పోయాడు శ్రీను. బాబీ తన ఇంటి వైపు నడక సాగించాడు.

ఇద్దరివీ పక్క పక్క ఇళ్ళే. శ్రీనుగాడి ఇంట్లో టి.వి. వుంది. అందులో రోజుకో సినిమా వస్తుంది. ఆ కథలన్నీ (అచ్చు హీరోలా 'ఆక్టు' చేస్తూ మరీ) చెపుతాడు శ్రీను. అందుకు లంచంగా పటిక బెల్లమో, పుట్నాల పప్పో సమర్పించుకుంటాడు బాబీ ప్రతీరోజూ.

ఆ రోజు మాత్రం మంచి సస్పెన్సులో ఆపు చేసాడు. అసలెందుకిట్లా ముద్దులు పెట్టేసుకుంటారు? మొన్న కుమార్ బావా అంతే. సీతక్క ప్రాణాలు తీసాడు.

ఆ రోజు తనూ సీతా అష్టా చెమ్మా ఆడుతున్నారు. సీత తనకన్నా ఆరేళ్ళే పెద్దది. అందుకని 'అక్కా' అనడు. అమ్మ తిట్టినా సరే – 'సీతా' అంటాడు. మరీ వొళ్ళు మండితే అప్పుడప్పుడు 'ఒసే సీతా' అని కూడా అంటాడు. ఒకసారి అమ్మ విని వీపు మీద వాయించేసింది కూడా. పాపం సీత మంచిదేలే. ఏడుస్తూంటే పిప్పరిమెంటు కెంగిలి చేసి పెట్టింది. సొంతక్కయినా సరే, సీతా అని పిలిపించుకోవటమే ఇష్టం దానికి. ఇంతకీ కుమార్ బావ సంగతి కదూ చెప్తున్నది.

ఆ రోజు తనూ సీతా అష్టా చెమ్మా ఆడుతూంటే కుమార్ బావొచ్చాడు. చేతిలో కొత్త సినిమా పత్రికుంది. పైన సీత కిష్టమైన హీరో బొమ్ముంది.

'నాకియ్యవా' అందుకోబోయింది.

చేతలు వెనక్కి పెట్టుకుని, 'ఒక ముద్దిస్తే ఇస్తా'నన్నాడు.

"ఛీ. అయితే వద్దులే" అంటూ బుంగ మూతి పెట్టింది.

తనకి వళ్ళు మండిపోయింది. తనని ఎదురుగా పెట్టుకుని వాళ్ళలా మాట్లాడేసుకోవటం. "పోనీ నే పెట్టనా' అని అడిగాడు బావని. కుమార్ పకపకా నవ్వేడు. "మీ అక్క చేత పెట్టించు".

సీత చివుక్కున లేచి నిలబడి, "నీ సంగతి బామ్మతో చెప్తా నుండు" అంది. కుమార్ కంగారుపడి, "చెప్పొద్దు ఇదిగో తీసుకో" అంటూ పత్రిక అక్కడ గిరాటేసి వెళ్ళిపోయాడు. సీత నవ్వుతోంది.

బాబీగాడికి లక్ష అనుమానాలొచ్చాయి.

సీతక్క ఎనిమిదో తరగతి చదువుతోంది. తనలాగే గోటీకాయలూ, చింతపిక్కలూ ఆడుతుంది. సైకిల్ కూడా తొక్కుతుంది. బావ ముద్దడుగుతే మాత్రం తనలా పెట్టదు. ఎందుకో...

ప్రేమ కథల



ఆలోచిస్తూనే మేడ మీద కెళ్ళాడు. బామ్మ మాగాయ ముక్కలు ఆర బోస్తోంది. సీత పెరట్లో చెట్లకి నీళ్ళు పోస్తోంది. కుమార్ పక్క డాబా మీద పచార్లు చేస్తున్నాడు.

బామ్మ చూడకుండా నాలుగు మాగాయి ముక్కలు జేబులో వేసుకోవటానికి ప్రయత్నించాడు బాబీగాడు. కానీ బామ్మవి పోలీసు కళ్ళు. ఇట్టే పట్టేసుకుంది. వీపుమీద నాలుగు వడ్డించి, "వెధవ కానా అంతా మైల చేసేసేవా?" అంది.

బామ్మ దెబ్బలు గట్టిగా వుండవు. కానీ కుమార్ నవ్వుతున్నాడు. అందుకని ఉక్రోషమొచ్చింది. "మైలేమిటి?" అన్నాడు.

"ఎంగిలి చేతులు. ఎక్కడ పడితే అక్కడ పెట్టావా?" గదమాయించింది.

"నీ మనవడు మా అక్కని ముద్దెట్టుకుంటానంటే మరి అది ఎంగిలి కాదా?" అన్నాడు లా పాయింటు తీస్తున్నట్టు.

ఆ రాత్రి పెద్దోళ్ళందరూ గుసగుస లాడేసుకున్నారు. గ్రూపులు గ్రూపులుగా విడిపోయి మాట్లాడేసుకున్నారు. నాలుగేళ్ళ తరువాత పెళ్ళి చేసేసేట్టూ, అప్పటి వరకూ కట్టడిలో వుంచేట్టూ తీర్మానాలు చేసుకున్నారు. తను చిన్నవాడు కాబట్టి, తను కూడా ఆ తీర్మానసభలో వుండటాని కి ఎవరూ అభ్యంతర పెట్టలేదు.

కుమార్‌ని వాళ్ళ అమ్మానాన్నలు తిడితే భలే సంతోషమేసింది. 'అంతే కావాలి బావకి' అనుకున్నాడు కసిగా. ఆ మరనటి రోజే కుమార్ ఐస్‌క్రీం ఇప్పిచ్చి 'థాంక్స్' అంటే మాత్రం అదెందుకో అర్థం కాలేదు. మొత్తానికి అందరూ

# పోటీలో నాలుగో బహుమతి పొందిన కథ

సంతోషంగా వున్నారు కాబట్టే తనూ సంతోషమే.

★ ★ ★

బాబీ... ఒరే''

చావిట్లో గచ్చుమీద సుద్దముక్కతో బొమ్మలేస్తున్న బాబీగాడికి తల్లి పిలుపు వినిపించలేదు.

''ఒరేయ్. నిన్నేరా ఎక్కడున్నావు?''

''వొస్తున్నా'' నంటూ విసుగ్గా పెరట్లోకి వెళ్ళాడు. బావి దగ్గిర బట్టలుతుకుతోంది అమ్మ. పక్కనే చప్టా మీద కూర్చొని సీత కుంకుడు కాయలు కొడ్తూ, డాబా మీద బొమ్మతో మాట్లాడుతూన్న బావనే ఓరకంట చూస్తోంది. కుమార్ రాక ఈ ఇంటికి నిషిద్ధమైనప్పటి నుంచి వారి ప్రేమ మరింత ఎక్కువైపోయింది.

''అవన్నీ డబ్బాలో కెత్తు'' అని పురమాయించింది. అమ్మ తను చేస్తున్న పని ఆపకుండానే.

విసుగ్గానే సీతక్క కొట్టిన కుంకుడుకాయలు డబ్బాలో వేయటం మొదలెట్టాడు బాబీగాడు. అంతలో ఎదురింటి పంకజమ్మత్త హడావుడిగా వచ్చింది ''... వదినా, ఇది విన్నావా'' అంటూ.

ఏమిటన్నట్టు చూసింది అమ్మ. పంకజమ్మత్త అదే వేగంతో చెప్పెయ్యబోతూ సీతను చూసి 'నువ్వు లోపలికెళ్ళవే'' అంది.

విననట్టే కుంకుడు కాయలు కొడ్తోంది సీత.

''పొయ్యి మీద పాలు పెట్టాను చూడు'' అంటూ అమ్మ ఆజ్ఞాపించింది. సీత విసవిసా లోపలికి నడుచుకుంటూ వెళ్ళిపోయింది. బాబీగాడిని వాళ్ళు అసలు పట్టించుకోలేదు. పంకజమ్మత్తా గొంతు తగ్గించి, రహస్యం చెపుతున్నట్టు, ''వెనుకింట్లో కాపరముంటున్న గవర్రాజు పని చూసావా?'' అంది.

''ఏం చేసాడు!''

''ప్రొద్దున్నే పాలు పోయటానికొచ్చిన ఆ కన్నయ్య కూతుర్ని ముద్దెట్టుకున్నాట్ట. పెద్ద గొడవ జరుగుతోంది''.

అమ్మ బుగ్గన వేలేసుకుంది. ''అయ్యో వీడిమొహం కాల్చా. పెళ్ళాం పురుడు పోసుకుని రావటానికి సిద్దంగా వుంది. వీడికిదేం పోయేకాలం'

''ఆ గవర్రాజు పెళ్ళాం రాగానే, వీడు చేసిన భాగోతం అంతా చెప్పి, గడ్డి పెట్టించాలి వదినా. మనలాటి సంసార్ల మధ్య నుండి ఇలాటి పన్లు చేస్తే ఎలా? మన మగాళ్ళనీ అలానే అనుకోరూ అలగా జనం'' అంది. ఆ తరువాత ఒక నిముషమూరుకుని, మళ్ళీ దగ్గిరకి జరిగి, రహస్యంగా అంది. ''ఈయన లేనప్పుడు ఈ మధ్య తెగొస్తున్నాడు వదినా — 'పేపరొచ్చిందా? పాల వాడొచ్చాడా?' అంటూ వొస్తున్నాడు. ఆ వాలకం చూస్తోంటే నాకూ భయంగా వుందనుకో''.

''రానియ్యకు. జాగ్రత్తగా వుండు. అసలే అందమైన దానివి కూడనూ'' అంది అమ్మ నవ్వుతూ.

''ఛీ. పో. వదినా'' అంటూ పంకజమ్మత్త చీరె జడా సవరించుకుంది. ''వెళ్ళొస్తా వొదినా. చాలా పనుంది. ఢిల్లీ నుంచి మా మేనత్త గారబ్బాయి వొస్తున్నాడు. మిలటరీ ఆఫీసర్లే. ఆంధ్రా వంటలంటే చాలా ఇష్టం'' అంటూ వెళ్ళిపోయింది.

బాబీగాడికి మాత్రం సమస్య రెట్టింపయింది. గవర్రాజు ముద్దెట్టుకుంటే అంత గొడవెందుకో అర్థం కాలేదు. ప్రతిరోజూ రోజా టీచర్ నన్ను ముద్దుపెట్టుకుంటుందిగా అనుకున్నాడు.

అమ్మ ఉతికిన బట్టలారేస్తోంది.

'అమ్మకేం తెలీదు' అనుకున్నాడు. 'పంకజమ్మత్తలా స్టయిలుగా తయారవదు. ఎప్పుడూ పాత నూలు చీరె పైకి ఎగ్గట్టి పన్జేస్తూంటుంది. సాయంత్రం దాకా వేలుముడితోనే ఉంటుంది. చక్కగా మొహం కడుక్కుని పౌడరు రాసుకుని బొట్టూ కాటుకా దిద్దుకుంటే పంకజమ్మత్త పక్కన నిలబడగలదా'.

ఇలా అయినా అమ్మే బావుంటుందనుకో. అది వేరే సంగతి.

★ ★ ★

''అబ్బ. వదలండి. పిల్లాడింకా బడికెళ్ళలేదు.'

''ఏం పర్లేదులే. అమ్మా సీతా లేరు. బాబిగాడు చంటి వెధవ''

బాబీగాడు బాత్‌రూమ్‌లోంచి బయటకొచ్చేసరికి అమ్మని నాన్న ముద్దుపెట్టుకోబోతున్నాడు. అమ్మ ఇష్టంగానే తోసేస్తోంది. నాన్నెప్పుడూ అంతే. బామ్మవుంటే బుద్ధిగా వుంటాడు. లేకపోతే అమ్మని బలత్కారం చేస్తాడు.

''అయ్యో. బాబీగాడు వచ్చేస్తాడండీ''

''వాడిమొహం. వాడికేం తెలుసు?''

''నాకంతా తెలుసు'' వెనుకనుంచి గంభీరంగా అన్నాడు బాబీగాడు, నడుము మీద చేతులేసుకుని. ''... నేనేం మరీ అంత చిన్నపిల్లాడిని కాను. పెద్దయిపోయి రెండోక్లాసు కొచ్చాను. మీరేమో అమ్మని అచ్చం సినిమాల్లో అబ్బాయిలా ముద్దుపెట్టుకుంటున్నారు''.

అమ్మ సిగ్గుపడిపోయి కొంగుతో మొహం తుడుచుకుంటూ, ''అన్నీ ముదరమాటలే. వెధవ చెడిపోయాడు'' అంది.

నాన్న పెద్దగా నవ్వుతూ వాడిని ఎత్తుకుని, ''నిన్నూ సీత అక్కయ్యనీ ముద్దు చేసినట్టే అమ్మని కూడా అప్పుడప్పుడూ ముద్దు చేయాలా బాబీ'' అన్నారు.

ఆలస్యం కాకుండా అనుమానం బయటపెట్టేసేడు ''అసలు ముద్దెందుకు పెట్టుకుంటారు నాన్నా?''

తండ్రి కంగారుపడి అంతెత్తు నించి వదిలేసాడు

''చూసారా వాడి వెంకి మాటలు. మీరే వాణ్ని చెడగొడ్తున్నారు'' అంది అమ్మ.

''ఇందులో చెడిపోయేదేముంది? తెలుసుకోని



## సలహా

''నా జుట్టు జలజల రాలిపోతోంది. ఖర్చు లేకుండా ఏం చెయ్యను!''?

''ఓ కాగితం తీసుకో, రాలే జుట్టు అందులో వెయ్యి. వుండచేసి అవతల పడేయి.''

''ఎప్పటి దాకా?''

''గుండు అయ్యేదాకా''.

— పద్మశ్రీ (మాణిక్యారం)





## ఇమేజ్

జయసుధ ఈ మధ్య చిత్రాల సంఖ్య చాలా తగ్గించుకుంది. ''నటీనటుల మధ్య ఇమేజ్ చాలా వర్కవుట్ అవుతుంది. ఎవరు పడితే వారి ప్రక్కన నటిస్తే ప్రేక్షకులు 'ఛీ' కొడతారు. ఆ సంఘటనే జరిగింది.'అక్కాచెల్లెలు' చిత్రంలో చాలామంది అభిమానులు బాధపడుతూ లెటర్సు రాశారు. తప్పు నాదే! నా ప్రక్కన ఎవరు నటిస్తున్నదీ, దాని ఇంపాక్ట్ జనంలో ఏ రేంజ్‌లో వుంటుందీ ఊహించకుండా నటించడం తప్పు కాదా మరి? అని చిరునవ్వుతోనే ఎదురు ప్రశ్న వేస్తుంది జయసుధ.

— సాయిరాం

పళ్లు రాలగొడ్తానన్నాడు — నిజమేగానీ దానికి నాకు కోపమెందుకొస్తుందో? అది విని చచ్చేట్టు నవ్వాను — నాకేంటో పళ్లు రాలగొట్టడం ఏంటో





### ఆయన

"ఏవండీ? రాజేష్ గారిల్లే కదండీ"

"ఏమో! ఇంతకీ ఆయన భార్య పేరేంటి?"

"సురేఖా గారండీ"

"ఆ నేనేనయ్యా ఆ రాజేష్‌ని"

— అన్వర్ ఖాన్
(అచ్చంపేట)

బాబీ. ప్రేమెక్కువయిపోతే తెలియజేసేందుకు అలా ముద్దు పెట్టుకుంటారన్నమాట".

"మరీ... పాలు పోసే కన్నయ్య కూతురి మీద గవర్రాజు గారికెందుకు ప్రేమెక్కువైపోయిందీ?"

అమ్మ రెక్కుచ్చుకుని బయటకి లాక్కెళ్ళి "తప్పు. నీకెందుకురా పెద్దవాళ్ళ గొడవలు. ఎవరి దగ్గిరా అనకు. నోర్మూసుకుని బడికెళ్ళు" అంటూ పుస్తకాల సంచి ఇచ్చేసింది.

తీరా బడికెళ్తే, ఎవరో మంత్రి చచ్చిపోయాడని శెలవిచ్చేసారు. ఇంటికొచ్చేసాడు. పదిన్నరకి అమ్మ పంకజమ్మత్త దగ్గిరకెళ్ళి పావుసేరు పప్పు బియ్యం తీసుకురమ్మని పంపింది.

ఐస్‌క్రీం బండి దగ్గిర కనిపించాడు శ్రీను.

"నీక్కూడా కావాలా?"

"మరి పైసలో"

"బోలెడున్నాయి. మా మిల్ట్రీ బాబాయ్ ఇచ్చాడు"

"వద్దులే. మా అమ్మ తిడుతుంది. నే మీ ఇంటికే వెళ్తున్నా. వస్తానా"

"నే సినిమాకెళ్తున్నా. అమ్మెళ్ళమంది" అంటూ టైమైపోయిందని హడావుడిగా వెళ్ళిపోయాడు శ్రీనుగాడు.

బాబీకి ఇంట్లో వాళ్ళ మీద బోలెడు కోపం వచ్చేసింది. 'శ్రీనుగాడి ఇంటికి బంధువులొస్తే డబ్బులిస్తారు. పంకజమ్మత్త కూడా మధ్యాహ్నప్పూట సినిమాకెళ్ళి నప్పుడల్లా ఇంట్లో వుండమని వాడికి డబ్బులిస్తుంది. అమ్మ అలా సినిమాలకే వెళ్ళదు. డబ్బులూ ఇవ్వదు. ఛీ...' అనుకున్నాడు

శ్రీనూ వాళ్ళ ఇంటి తలుపు దగ్గిరగా వేసి వుంది. బాబికి ఆ ఇంట్లో బాగా చనువుండటంతో, తోసుకుని లోపలికి వెళ్ళాడు. ముందు హాలు ఖాళీగా వుంది. బెడ్‌రూమ్‌లోకి 'అత్తయ్యా' అని పిలుస్తూ వెళ్ళబోయాడు. నోటమాట అక్కడే ఆగిపోయింది. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవయ్యాయి.

★ ★ ★

ఇంటి కొస్తూంటే బాబిగాడికి బాగా ఏడుపొచ్చింది. ఆయన మావయ్య కాదు. మిల్ట్రీ మీసాలున్నాయి. ఇద్దరూ తనని చూడలేదు.

అయినా అలా ముద్దుపెట్టుకోవచ్చా?

శీనూకి విషయం చెప్తే ఏడుస్తాడేమో.

మావయ్య కూడా.

అయినా నాన్న అలా చెప్పాడేమిటి? ప్రేముంటే తప్ప ముద్దు పెట్టుకోరని. మరి పంకజమ్మత్త ఆయన్ని ఎందుకు ముద్దు పెట్టుకుంది? శ్రీనూగాడి మీదా, మావయ్య మీదా తప్ప అలా వేరేవాళ్ళ మీద ప్రేముండొచ్చా?

ఆ రాత్రి అన్నీ పీడకలలే.

ఎవరో రాక్షసుడు పంకజమ్మత్తని ఎత్తుకుపోతున్నట్టు, శ్రీనూగాడూ మావయ్యా కింద ఏడుస్తూ పరుగెడుతున్నట్టు, వాళ్ళు మేఘాల్లోకి మాయమైపోయినట్టు....

ఆ రాత్రి బాబీకి వళ్ళెరుగని జ్వరమొచ్చింది.

★ ★ ★

"బాబీ... నాన్నా... ఎలా వుందిరా?"

"కన్నా... కళ్ళు తెరూ బాబూ"

అమ్మనాన్నల గొంతు నూతిలోంచి వినిపిస్తున్నట్టు ంది. రెప్పలు బలవంతంగా తెరుద్దామని ప్రయత్నించినా సాధ్యం కావటంలేదు. జ్వరంతో మైకం కమ్మేస్తోంది. వళ్ళు పేలిపోతూంది.

"తిరుపతి వెంకన్నా. నా బాబు కళ్ళు తెరిచి తిరిగి ఆడుకునేలా చెయ్యి తండ్రీ. నడిచి నీ కొండెక్కుతాను" అమ్మ ఏడుస్తోంది.

"ఊరుకో ఊరుకో ఏడవకు" నాన్నగారు అమ్మని ఓదారుస్తున్నారన్నమాటే గానీ ఆయనే ఎక్కువ ఏడుస్తున్నట్టుంది.

సీతక్క బామ్మతో, "కొంచెం కాఫీ తాగు బామ్మా" అంటోంది.

"నా బంగారు తండ్రి కళ్ళు తెరిచేదాకా పచ్చి గంగ ముట్టను" అంటోంది బామ్మ.

మాటిమాటికీ నుదురుమీద చెయ్యేసి చూస్తున్నారు నాన్నగారు. సీతక్క ముక్కు ఎగబీలుస్తూ తడి గుడ్డతో వళ్ళంతా తుడుస్తోంది.

"నాకేం కాలేదు. ఏడవకండి" అని చెప్పాలనుకున్నాడు. గొంతు పెగల్లేదు. నిద్రలోకి జారిపోతూండగా, "తల నీలాలిస్తా స్వామీ" అని బామ్మ అన టం వినిపించింది.

....

మరో రోజు గడిచింది.

వళ్ళంతా తడిసిపోయి, స్నానం చేసినట్టు అనిపించింది.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

మంచం పట్టెకి తల ఆన్చి మాగన్నుగా నిద్రపోతుంది అమ్మ. కిటికీ దగ్గిర నిలబడి బయటకు చూస్తున్నారు నాన్నగారు. నేలమీద పడి నిద్రపోతోంది అక్క.

'అమ్మా' అన్నాడు నెమ్మదిగా.

ఒక్కసారిగా ఆ మాట గదిలో కలకలం రేపింది. కిటికీ దగ్గిర నాన్న చివుక్కున వెనక్కి తిరిగారు. అమ్మ కలలోంచి మేల్కొన్నట్టు సంభ్రమంగా కళ్ళు విప్పింది. అమ్మవైపు చూస్తూ నెమ్మదిగా చిరునవ్వు నవ్వేడు.

"అమ్మా"


"బాబూ" అంటూ పొదివి పట్టుకొని ఒక్కసారి ఏడ్చేసింది. కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని కూర్చున్న వారందరినీ చూసి, "నాకు జ్వరం తగ్గిపోయిందిగా" అన్నాడు.


"మా నాన్నే" అంటూ అమ్మ —

"బుజ్జీ" అంటూ నాన్న —

ఒకేసారి వంగి రెండు బుగ్గల మీదా ముద్దులు పెట్టుకున్నారు.

అప్పుడర్థమైంది బాబీకి నిజమైన ముద్దు ఎందుకు పెట్టుకుంటారో...



### 'ఆలీ' హీరోగా మరో రెండు చిత్రాలు

'ఆలీ' యమలీల విడుదల కాకముందే బ్రహ్మానందంతో కలిపి 'ఫైటింగ్ మాస్టర్' నటించనున్నాడు.

అలాగే 'మిస్టర్ మాయగాడు'గా చోటా కె.నాయుడు చిత్రం నిర్మించనున్నాడు.

మరో యిద్దరు పెద్ద ప్రొడ్యూసర్లు 'యమలీల' రెస్పాన్స్ చూసి వెంటనే కావలసినంత అడ్వాన్సు యిచ్చి పిక్చరు ప్రారంభించడానికి సిద్ధంగా వున్నారు.

— సాయిరాం